క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెన్‌పహాడ్‌: మండల పరిషత్‌ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

చివ్వెంల(సూర్యాపేట): విద్యుత్‌ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలో గురువారం విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌ ఏఈ మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నగదు పట్టివేత

పెన్‌పహాడ్‌: ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల పరిధిలోని దూపహాడ్‌ చెక్‌ పోస్టు వద్ద బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి వద్ద రూ. 94,200లు స్వాధీనం చేసుకొని గ్రీవెన్స్‌ సెల్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ రవీందర్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకెళ్తే పట్టివేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యాచకుడికి గాయాలు

సూర్యాపేట క్రైం: సూర్యాపేట కొత్త బస్టాండ్‌ అండర్‌ బ్రిడ్జి కింద ప్రతి రోజు డివైడర్‌ మధ్యలో ఉంటూ జీవిస్తున్న యాచకుడు సత్యనారాయణ కాళ్లపై నుంచి హైదరాబాద్‌ నుంచి విజయవాడ వెళ్తున్న రాజధాని బస్సు బుధవారం రాత్రి వెళ్లింది. నిద్రపోతున్న యాచకుడి కాళ్లపై నుంచి బస్సు వెళ్లడంతో కాలు విరిగింది. వెంటనే స్థానికులు అంబులెన్స్‌ సహాయంతో జనరల్‌ ఆసుపత్రికి తరలించారు.

ఆర్థికసాయం అందజేత



లక్ష్మణ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న ఆటో యూనియన్‌ నాయకులు

అర్వపల్లి: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ పంచాయతీకి చెందిన ఆటో డ్రైవర్‌ బొడ్డు లక్ష్మణ్‌ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందాడు. తిమ్మాపురం గ్రామ ఆటో యూనియన్‌ సభ్యులు స్పందించి నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మణ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మణ్‌కు దాతలు సాయమందించి ఆదుకోవాలని ఆటో యూనియన్‌ నాయకులు కోరారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

నూతనకల్‌: వేసవి దృష్ట్యా ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్‌ కోరారు. బుధవారం నూతనకల్‌ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో కూలీలు ఉపశమనం పొందడం కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని, పని దినాలను 200రోజులకు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దెల రాంమ్మూర్తి, లింగయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీవాసులకు ఉచిత మీటర్లు ఇవ్వాలి

చిలుకూరు: మండలంలోని ఎస్సీ కాలనీవాసులకు ఉచితంగా విద్యుత్‌ మీటర్లు ఏర్పాటు చేసి, వారికి ఫ్రీ కరెంట్‌ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెమిడాల రాజు అన్నారు. బుధవారం చిలుకూరులోని సీపీఐ భవనలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ కాలనీవాసులకు ఎప్పటి నుంచో ఉచిత కరెంట్‌ అని చెబుతున్నారని కానీ అధికారులు మాత్రం విద్యుత్‌ మీటర్లు లేవని వారిపై కేసులు రాయడం, జరిమానాలు వేయడం, డెవలప్‌మెంట్‌ పేరుతో డబ్బులు వసులు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఎస్సీ కాలనీవాసులకు విద్యుత్‌ మీటర్లు, ఉచిత కరెంట్‌ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మౌలానా, సైదులు తదితరులు పాల్గొన్నారు.

గోపయ్య, తిరుపతమ్మకు పూజలు

నడిగూడెం: మండలంలోని వేణుగోపాలపురంలో బుధవారం గోపయ్య, తిరుపతమ్మల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, వేద పారాయణం, ఆదివాసహనములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వాహనాల వేలం రద్దు

హుజూర్‌నగర్‌: ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున హుజూర్‌నగర్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌లో బుధవారం నిర్వహించాల్సిన వాహనాల వేలం రద్దు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. కోడ్‌ ముగిసిన తర్వాత వేలం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని పేర్కొన్నారు.

చివరిదాకా నీళ్లు వచ్చేనా !



కోడూరు గ్రామ పరిధిలో ఎండిపోయిన వరిపొలాలు

- ఈ నెల 23 నుంచి వారబందీ విధానంలో 6వ విడత నీటి విడుదల
- ఇప్పటివరకు ఇచ్చిన నీళ్లు సరిపోక ఎండిపోతున్న వరి పొలాలు

అర్వపల్లి: నీటిపారుదల శాఖ ప్రకటించిన షెడ్యూల్‌ ప్రకారం ఈ నెలాఖరు వరకు గోదావరి జలాలు రావాల్సి ఉంది. వారబందీ విధానంలో ఆరో విడతగా ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నీళ్లు వదలాల్సి ఉంది. అయితే ఈ యాసంగి సీజన్‌లో షెడ్యూల్‌ ప్రకారం నీళ్లు సరిగా రాకపోవడం, వచ్చిన నీళ్లు తక్కువగా రావడంతో పంటలకు నీళ్లు చాలని పరిస్థితి ఏర్పడింది. ఈసారి మొదటి నుంచి సాగు నీటి సమస్య తలెత్తి వరి పంటలకు నీళ్లు చాలక పంట సరిగా పండలేదు. అయితే ఐదో విడతలో ఈ నెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు గోదావరి జలాలు వారం రోజుల పాటు రావాల్సి ఉండగా.. కేవలం నాలుగు రోజులు మాత్రమే ఇచ్చి నిలిపివేశారు. అంతకుముందు వారాలు కూడా నీళ్లు అంతంతమాత్రంగానే వచ్చాయి. దీంతో గ్రామాల్లో ఎక్కడా పంటలకు సరిపోను నీళ్లు అందక ఎండిపోతున్నాయి.

చివరి గ్రామాల్లో పరిస్థితి దయనీయం

జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ సీజన్‌ నందు సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంటలు సాగయ్యాయి. అయితే మండలంలోని చివరి గ్రామాలైన కోడూరు, కొమ్మాల, లోయపల్లి, సూర్యానాయక్‌తండా, కోమటిపల్లి, తిమ్మాపురం, చాకలిగూడెం తదితర గ్రామాలకు నీళ్లు అందక వరి పంటలు ఎక్కువగా ఎండిపోయాయి. ఒక్క కోడూరు గ్రామంలోనే 1800 ఎకరాల్లో వరి సాగు కాగా ఇప్పటి వరకు 500 ఎకరాలకు పైగానే వరి పంట ఎండిపోయింది. చివరి విడత(ఆరో తడి) నీళ్లు రాకపోతే ఎకరం పంట కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు వాపోతున్నారు. కాగా మరో 40 నుంచి 50 రోజుల్లో వరి పంటలు చేతికొచ్చే అవకాశం ఉంది. కనీసం మరో రెండు తడులు నీటిని వదిలి పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆరెకరాల పంట ఎండిపోయింది



ఆరు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వరి సాగుచేస్తున్నాను. రూ.2లక్షలకు పైగానే పెట్టుబడి పెట్టాను. నీటి సదుపాయం లేకపోవడంతో కేవలం గోదావరి జలాలపై ఆధారపడి వరి పంట సాగుచేస్తున్నాను. ఈసారి నీళ్లు తక్కువ వదలడంతో చివరి గ్రామమైన మా ఊరికి నీళ్లు సరిగా రాక పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో పశువులు, జీవాలు మేపుకోవడానికి ఎండిపోయిన పంటను వదిలేశాను. ప్రభుత్వం ఆదుకోకపోతే నా కుటుంబం రోడ్డున పడుతుంది.

– నిద్ర సతీష్‌, కౌలు రైతు, కోడూరు

పంటలకు వదిలే పరిస్థితి లేదు



గోదావరి నదిపై పైన నీటి లభ్యత తక్కువగా ఉండటంతో ఈసారి నీళ్లు తక్కువగా వదులుతున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేవలం తాగునీటి కోసం మాత్రమే పైన సరిపోను నీరు ఉందని, పంటలకు వదిలే పరిస్థితి లేదని పై అధికారులు చెబుతున్నారు. చివరి విడతగా ఈ నెల 23 నుంచి కొన్ని నీళ్లైనా ఇచ్చేలా ప్రయత్నం చేస్తున్నాం.

– ఎం. సత్యనారాయణ, బయ్యన్నవాగు డీఈఈ

కేంద్రంలో మూడోసారి బీజేపీదే అధికారం

- బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌



తిరుమలగిరి: మాట్లాడుతున్న బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌

తిరుమలగిరి (తుంగతుర్తి): కేంద్రంలో మూడోసారి కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ అన్నారు. బుధవారం తిరుమలగిరిలో బీజేపీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి మచ్చలేని నిస్వార్థ నాయకుడని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు గెలిచి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో తాను భువనగిరి ఎంపీగా ఉన్నప్పుడు రూ.9వేల కోట్లతో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. రూ.1400 కోట్లతో బీబీనగర్‌లో ఎయిమ్స్‌, భువనగిరిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషిచేశానని వివరించారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు ఎక్కువ బీజేపీ ప్రభుత్వమే ఇచ్చిందని, దేశ ప్రజలందరికీ ఉచితంగా రేషన్‌ బియ్యం అందిస్తుందని అన్నారు. పార్టీలకతీతంగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. అవినీతిమయమైన కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీలను ఓడించాలన్నారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కరువు తాండవిస్తుందని, విద్యుత్‌ కోతలు మొదలయ్యాయని, రైతు బంధు సక్రమంగా రావడం లేదని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి శిలాఫలకాలు వేయాలంటే కూడా అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడెం రామచంద్రయ్య, బండారు లింగస్వామి, కాప రవికుమార్‌, వై. దీన్‌దయాళ్‌, యాదగిరి, కూరాకుల వెంకన్న, మూల వెంకట్‌రెడ్డి, స్వామి యాదవ్‌, కందుకూరి సోమయ్య, సుభాష్‌రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ అభయ హస్తం.. బస్మాసుర హస్తమే

తుంగతుర్తి: కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపట్టిన అభయ హస్తం పథకం బస్మాసుర హస్తమేనని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తుంగతుర్తి మండల కేంద్రంలో వారు బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరువును, అవినీతిని కొనుక్కున్నట్లేనని ఎద్దేవా చేశారు. రామ మందిరం నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయడం దేశానికే గర్వకారణమన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబు, నాయకులు కాప రవి, లింగస్వామి, దాయం ఝాన్సీరెడ్డి, నరసింహారెడ్డి, అంజయ్య, సైదులు, మహేందర్‌, నాగరాజు, యాదగిరి, నరేష్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్‌

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ అన్నారు. బుధవారం తిరుమలగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గిన తర్వాత ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. తిరుమలగిరి మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత బంధులో కోట్ల రూపాయలు చేతులు మారాయని, దళిత బంధు పథకంపై విచారణ చేయాలని అసెంబ్లీలో సైతం మాట్లాడానని, దీనిపై జ్యుడీషియల్‌ ఎంక్వైరీ చేయించి బాధితులకు న్యాయం చేస్తానని అన్నారు. అనంతరం కౌన్సిలర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు వై. నరేష్‌, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



నెమ్మికల్లులో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూర్‌(ఎస్‌): ఓటర్లు శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూర్యాపేట డీఎస్పీ జి. రవి అన్నారు. బుధవారం ఆత్మకూర్‌(ఎస్‌) మండల పరిధిలోని నెమ్మికల్లు, గట్టికల్లు, ఆత్మకూర్‌ గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఓటర్లు మద్యం, డబ్బు వంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గ్రామాలల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు. సోషల్‌ మీడియాలో ఇతరులను దూషించేలా, కించపరిచేలా పోస్టులు పెడితే అడ్మిన్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రూరల్‌ సీఐ సురేందర్‌రెడ్డి, స్థానిక ఎస్‌ఐ వై. సైదులుగౌడ్‌, సీఐఎస్‌ఎఫ్‌ సిబ్బంది, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో పోరాటం చేయాలి



తిరుమలగిరిలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి): మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాడాలని మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య, జీఎంపీఎస్‌ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య అన్నారు. మల్లు స్వరాజ్యం 2వ వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నీర్మాల యాకయ్య, లక్ష్మయ్య, కడారు లింగయ్య, నలుగూరి రమేష్‌, కందుకూరి వెంకన్న, దూపటి సోమన్న, చింతకింది సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి వినతి

భానుపురి (సూర్యాపేట): రాష్ట్రంలోని పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రభుత్వ రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్‌. సీతారామయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎస్‌ సుదర్శన్‌రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు జి. వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న రిటైర్డ్‌ ఉద్యోగుల సంఘం నాయకులు

ఎమ్మెల్యే పరామర్శ

అర్వపల్లి: మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ సీనియర్‌ నేత చెంచల శ్రీనివాస్‌ కుమారుడు అచ్యుత్‌ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు బుధవారం కోడూరు గ్రామానికి వెళ్లి అచ్యుత్‌ను పరామర్శించారు. ఆయన వెంట చెంచల శ్రీనివాస్‌, దిర్శనపు కృష్ణమూర్తి, సామ రవీందర్‌రెడ్డి, సంగు వెంకన్న, బాకు మల్లయ్య ఉన్నారు.

దాడి కేసులో ఇద్దరిపై కేసు నమోదు

మేళ్లచెరువు: ఒకరిపై గొడ్డలితో దాడి చేసి గాయపరిచిన ఇద్దరిపై బుధవారం మేళ్లచెరువు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన గోపిశెట్టి శంకర్‌, మణి ఆర్థిక లావా దేవీల దృష్ట్యా మంగళవారం రాత్రి శివాలయం పరిధిలో చింతలపాలెం మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన శంషద్‌పై గొడ్డలితో దాడి చేశారు. అతడి తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు వెంటనే 108లో హుజూర్‌నగర్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కోదాడ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. గాయపరచిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.4కోట్లకు ఐపీ దాఖలు

మఠంపల్లి: మండలంలోని బక్కమంతులగూడెంలో రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారంతో పాటు చిట్టీల వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి ఏకంగా రూ.4 కోట్లకు పైచిలుకు ఐపీ దాఖలు చేసిన విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో సుమారు 70 మంది బాధితులు లబోదిబోమంటున్నారని తెలిసింది. సదరు వ్యక్తి హైదరాబాద్‌లో రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తూ బక్కమంతులగూడెం, చౌటపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు, వ్యాపారస్తుల వద్ద సుమారు రూ.4 కోట్లకు పైగా పైకాన్ని వడ్డీలకు తీసుకున్నట్లు సమాచారం. కాగా బాధితులు మధ్యవర్తుల ద్వారా పైకాన్ని పొందేందుకు ప్రయత్నాలు చేస్తుండగా సదరు ఐపీ దాఖలు చేసిన వ్యక్తి గ్రామంలో లేకుండా వెళ్లినట్లు తెలిసింది.

పెండింగ్‌ మెస్‌ చార్జీలు చెల్లించాలి

గరిడేపల్లి: పెండింగ్‌లో ఉన్న మెస్‌ చార్జీలు వెంటనే చెల్లించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. హాస్టల్‌ విద్యార్థులకు 10 నెలల మెస్‌ చార్జీల బకాయిలు ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని కోరారు.

మారనున్న అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ రూపురేఖలు

- 'పీఎంశ్రీ' పథకానికి ఎంపిక
- తొలుత రూ.27లక్షలతో అదనపు గదుల నిర్మాణం
- పాఠశాల నిర్వహణ నిధులు కూడా విడుదల



అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌

అర్వపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ఏడాది కిత్రం కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్‌ ఫర్‌ రైజింగ్‌ ఇండియా) పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే పనుల మొదలులో జాప్యం జరిగింది. తాజాగా ఈ పథకం నిధులు మంజూరయ్యాయి. నిర్వహణ నిధులు కూడా విడుదల అయ్యాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి నిధుల కేటాయింపు జరుగుతుంది. ఈ పథకంలో భాగంగా జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ను ఎంపిక చేశారు.

సమకూరనున్న అన్ని వసతులు..

పీఎంశ్రీ పథకానికి ఎంపికైన ఈ పాఠశాలలో కార్పొరేట్‌ స్థాయి హంగులు కల్పించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, ప్రయోగశాల, డిజిటల్‌ గ్రంథాలయం, ఇంటర్నెట్‌ కనెక్షన్‌, వృత్తి విద్యాకోర్సుల అమలు, క్రీడా సామగ్రి, సోలార్‌ విద్యుత్‌ ప్యానెల్‌ ఏర్పాటు, కూరగాయల తోట, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించడంతో పాటు నాణ్యమైన విద్య అమలుకు చర్యలు తీసుకోనున్నారు. తొలి విడతగా పాఠశాలలో రెండు అదనపు గదుల నిర్మాణానికి ఈ పథకం కింద రూ.27లక్షలు మంజూరు కాగా ఈ పనుల ప్రారంభానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు శంకుస్థాపన చేశారు. అలాగే పాఠశాల నిర్వహణ నిధుల కింద ఏడాదికిగాను రూ.99,939 విడుదయ్యాయి. ఇలా ఈ పథకం కింద పాఠశాలలో అన్ని వసతులు కలగనున్నాయి.

సమస్యలు తీరుతాయి



మా పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావడంతో అన్ని సమస్యలు తీరుతాయి. ప్రధానంగా మాకు స్వచ్ఛమైన తాగునీరు రానుంది. ల్యాబ్‌, గ్రంథాలయం వస్తాయని చెబుతున్నారు. అన్ని వసతులు కలిగితే పాఠశాల ఎంతో అభివృద్ధి చెందుతుంది.

– నెహ్రూ, విద్యార్థి

నిధులు మంజూరయ్యాయి



తొలుత రెండు అదనపు గదుల నిర్మాణానికి రూ.27 లక్షలు మంజూరయ్యాయి. గదుల పనుల ప్రారంభానికి శంకుస్థాపన కూడా జరిగింది. పాఠశాల నిర్వహణ నిధులు కూడా విడుదయ్యాయి. పాఠశాల అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుంది.

– సీహెచ్‌. నర్సయ్య, హెచ్‌ఎం

గాలికుంటు వ్యాధిని సమూలంగా నివారించాలి

- పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ పి. పెంటయ్య



మునగాలలో గాలికుంటు వ్యాధి నివారణ వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న పెంటయ్య

మునగాల : పశువులకు సోకే గాలికుంటు వ్యాధిని సమూలంగా నివారించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పి.పెంటయ్య అన్నారు. మునగాల మండల కేంద్రంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ శిబిరాన్ని ఆయన బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ మండలంలో టీకాల నిర్వహణ మందకొడిగా సాగుతుందని తెలిపారు. సిబ్బంది తక్షణమే స్పందించి మండల వ్యాప్తంగా ఉన్న పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడాన్ని ముమ్మరం చేసి పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామాలలోని అందరూ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పాల యూనియన్స్‌ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి డా.ఇ.భాస్కర్‌ , సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం

- దేవానంద జీయర్‌స్వామి నేతృత్వంలో మూలమూర్తుల ప్రాణప్రతిష్ఠ
- స్వామివార్లకు మహాకుంభాభిషేకం, సంప్రోక్షణ, మహాపూర్ణాహుతి



విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవంలో ప్రవచనాలు చెబుతున్న దేవానంద జీయర్‌స్వామి

కోదాడఅర్బన్‌: కోదాడ పట్టణంలో శ్రీకోదండ రామాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. దేవానంద జీయర్‌స్వామి నేతృత్వంలో రామాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం 10.02 గంటలకు సర్వదేవతా మూర్తులకు ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. అనంతరం రుత్వికులు.. సంప్రోక్షణ, మహాకుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, గర్భాలయ ప్రవేశం గావించారు. ఆలయంలో సీతా,లక్ష్మణ సమేత కోదండరాముడు, అన్నపూర్ణ సమేత బోలా లింగేశ్వరస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి, రాధాకృష్ణులు, ఆళ్వారులతో పాటు ఆంజనేయస్వామి, వాసవి, కన్యకాపరమేశ్వరి అమ్మవారుల ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అదేవిధంగా ఆలయ ఆవరణలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం సంప్రోక్షణ, పుష్పాలంకరణ తరువాత భక్తులకు స్వామివార్ల దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివార్లకు పూజలు చేశారు.

ఏడుచోట్ల భక్తులకు అన్నదానం..

కాగా, పట్టణంలో ఏడు చోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 80వేల మందికి అన్నదాన వితరణ చేశారు. ఉత్సవాల్లో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, హుజూర్‌నగర్‌ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, ఆలయ ధర్మకర్తలు నాగుబండి రంగా, నాగుబండి లక్ష్మయ్య, నాగుబండి రంగనాథ్‌, నాగుబండి నందగోపాల్‌, పట్టణ ప్రముఖులు పాండురంగారావు, లక్ష్మీనారాయణరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు. కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ సీఐ టి.రాము భారీ పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

శ్రీకోదండరామాలయంలో మూలమూర్తులను కోదాడ పీడీఎం కోర్టు జూనియర్‌ సివిల్‌ జడ్జి ఎస్‌.శ్యాంసుందర్‌, పీడీఎం కోర్టు జడ్జి భవ్యలు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రుత్వికులు వారికి ఆశీర్వాదం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో ప్రశాంతత లభిస్తుందని అన్నారు. అదేవిధంగా సీనియర్‌ న్యాయవాది కేఎల్‌ఎన్‌ ప్రసాద్‌ కూడా దేవతామూర్తులను దర్శించుకున్నారు.

అధ్యయనోత్సవాలు ప్రారంభం



చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

సూర్యాపేట రూరల్‌: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి చెన్నకేశవస్వామి దేవాలయంలో బుధవారం అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యజ్ఞాచార్యులు మరింగంటి వరదాచార్యులు ఆధ్వర్యంలో తొలక్కం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ రాజబాబురెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త ఉమ్మెంతల హరిప్రసాదరావు, అర్చకులు ముడుంబై రఘువరన్‌ ఆచార్యులు, డైరెక్టర్లు చెరుకుపల్లి కృష్ణయ్య, మంగపండ్ల మల్లికార్జున్‌, కుమ్మరికుంట్ల జానయ్య, సైదమ్మ, శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అర్వపల్లి: ఎన్నికల కోడ్‌ను ప్రతిఒక్కరూ తప్పకుండా పాటించాలని అర్వపల్లి ఎస్‌ఐ ఎస్‌కే యాకూబ్‌ సూచించారు. అర్వపల్లిలో వై-జంక్షన్‌ వద్ద బుధవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ మొత్తాన్ని వెంట తీసుకెళ్లరాదని ఎస్‌ఐ చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాములు, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెన్‌పహాడ్‌: మండల పరిధిలోని లాల్‌సింగ్‌తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గవాస్కర్‌, ఉపాధ్యాయురాలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలి



అడివెంల గ్రామంలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

అర్వపల్లి: మండల పరిధిలోని అడివెంల గ్రామంలో బుధవారం పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్‌ బి. అర్జున్‌ మాట్లాడుతూ.. ఉచిత టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్‌ఎస్‌ పద్మ, సిబ్బంది యాదగిరి, యాకయ్య, గోపాల మిత్ర ఆల్డాస్‌ లింగయ్య, రైతులు పాల్గొన్నారు.